క్లుప్తంగా

గుడిపేటలో 'పొలంబాట'



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని పంటపొలాల్లో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ మంచిర్యాలరూరల్ ఏడీఈ మోహన్‌రెడ్డి, హాజీపూర్ ఏఈ మహేందర్‌రెడ్డి పాల్గొని రైతులకు విద్యుత్ ప్రమాదాలపై, విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యుత్ మోటార్లకు బిగించిన ఆటో స్టార్టర్లు తొలగించి, కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు.

దొనబండ చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలోని ఊర చెరువును మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు ఆదివారం నీటిపారుదల శాఖ ఈఈ రాము, డీఈఈ కుమార్, ఏఈఈ ప్రణీత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, గిర్దావర్ ప్రభు పరిశీలించారు. త్వరలోనే చెరువు తూము, చెరువు కట్ట మరమ్మతులకు సంబంధించి అంచనా తయారు చేసి, నిధుల మంజూరుకు పంపిస్తామన్నారు. నిధులు మంజూరు కాగానే ఎమ్మెల్యే సూచనల మేరకు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అధ్యయన కేంద్రంలో ఈ నెల 15వ తేదీలోగా ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, ఓపెన్ డిగ్రీ కో ఆర్డినేటర్ ఏకాంబరం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పలు విడతల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరగ్గా ఈ నెల 15వ తేదీ వరకు మరోసారి గడువును పొడిగించారని తెలిపారు. దాదాపు 40మంది విద్యార్థులు అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకొని, వెరిఫికేషన్ చేయించుకోకుండా, అడ్మిషన్ ఫీజు చెల్లించకుండా ఉన్నారని పేర్కొన్నారు. వారంతా వెంటనే సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకొని, అడ్మిషన్ ఫీజు చెల్లించి, డిగ్రీలో ప్రవేశం పొందాలని సూచించారు. ఇతర వివరాల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

డిసెంబర్ 3న అయ్యప్ప స్వాముల మహాసంగమం



తిరుమల్‌రావును సన్మానిస్తున్న ఏబీఏపీ సభ్యులు

మంచిర్యాలఅర్బన్: శబరిమలలో భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు మేల్‌శాంతి సమాజం, అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ కృషి చేస్తుందని ఏబీఏపీ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రావు అన్నారు. మంచిర్యాలలో ఆదివారం ఏబీఏపీ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిసెంబర్ 3న అయ్యప్పస్వాముల సామూహిక పడిపూజా, కోటి పుష్పార్చన పోస్టర్లను ఆవిష్కరించారు. మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో డిసెంబర్ 3న అయ్యప్పస్వాముల సామూహిక పడిపూజా, అయ్యప్ప స్వాముల మహాసంగమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌కిరణ్, గౌరవ అధ్యక్షుడు నర్సింహరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



రేంజ్ కార్యాలయంలో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

జన్నారం: అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. రేంజ్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. కవ్వాల్ టైగర్ జోన్ ప్రాంతంలోని జన్నారం అటవీ డివిజన్‌లో ఏకో సెన్సిటీవ్ జోన్ పరిధిలో ఇసుక తవ్వకాలు జరుపొద్దని సూచించారు. ఇప్పటికే ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించామని తెలిపారు. మరోసారి ఇసుకతో ట్రాక్టర్లు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా కలప స్మగ్లింగ్ నిరోధంపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. రాత్రి పగలు, పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యం.. దైన్యం



రామకృష్ణాపూర్‌లోని పల్లె దవాఖానా

- క్యాతనపల్లిలో ప్రభుత్వ దవాఖానా కరువు
- వైద్యం కోసం మంచిర్యాలకు వెళ్లాల్సిన దుస్థితి..
- 40వేల జనాభా ఉన్నా ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

రామకృష్ణాపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మేజర్ గ్రామపంచాయతీగా ఉండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొదటి విడతలోనే మున్సిపాలిటీగా మారిన ఘనత సంపాదించుకున్న క్యాతనపల్లి మున్సిపాలిటీకి ప్రభుత్వ దవాఖానా కరువైంది. 40వేల జనాభా ఉండి, 25వేల పై చిలుకు ఓటర్లున్న ఈ మున్సిపాలిటీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాదు కదా కనీసం సబ్‌సెంటర్ కూడా లేదు. పల్లె దవాఖానా పేరిట రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఓ కేంద్రం ఉన్నప్పటికీ, తూతూమంత్రంగానే పనిచేస్తోందన్న ఆరోపణలున్నాయి. ఒక్క డాక్టర్ కూడా వచ్చిపోతున్న దాఖలాలు లేవు. రామకృష్ణాపూర్, కుర్మపల్లి, అమరవాది, గద్దెరాగిడి ప్రాంతాల్లో సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి మున్సిపాలిటీ హెడ్ క్వార్టర్లో పీహెచ్‌సీ నెలకొల్పాలని డిమాండ్ చేస్తున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు సర్కారు వైద్యానికి నోచుకోవటం లేదు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న సమయంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి కనిపించటం లేదు. మున్సిపాలిటీ పరిధిలో 40వేలకు పైగా జనాభా ఉంది. 25వేలకు పైగా ఓటర్లున్నారు. అయితే ఇంత పెద్ద మున్సిపాలిటీలో కనీసం ప్రైమరీ హెల్త్ సెంటర్ కూడా లేకపోవటం గమనార్హం. అత్యవసర పరిస్థితుల్లో ఇంత పెద్ద మున్సిపాలిటీ పరిధిలో కనీసం ఒక్క ప్రభుత్వ వైద్యుడు కూడా అంటుబాటులో లేరంటే పరిస్థితి ఇట్టే అర్థమవుతోంది.

లక్ష్యం నెరవేరని పల్లె దవాఖానా..

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రామకృష్ణాపూర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఓ భవనాన్ని నిర్మించారు. అయితే ఇది ప్రారంభించి ఏడాది దాటినా ఇప్పటివరకు ఇక్కడికి ఒక్క వైద్యుడు కూడా వచ్చిన దాఖలాలు లేవు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పల్లె దవాఖానాలో ఓపీ సేవలు, ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉచిత మందులు, నిపుణులతో టెలీ కన్సల్టేషన్, హెల్త్ మేళాలు, ఆరోగ్యం పెంపొందించే కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉండగా అలాంటి వేవి కనిపించటం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఒక్క ప్రభుత్వాసుపత్రి కూడా లేకపోవటం బాధాకరం. ఇంత పెద్ద జనాభా ఉన్న మున్సిపాలిటీలో ఆసుపత్రి లేదంటే అది కేవలం ప్రజాప్రతినిధులు, అధికారుల పట్టింపులేనితనమే. ఇప్పటికైనా ఆసుపత్రి ఏర్పాటుతో పాటు అందులో వైద్యులు 24గంటలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి
– గుత్తుల వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తోంది



ప్రతీ చిన్న వైద్య సహాయం కోసం మంచిర్యాలకే వెళ్లాల్సి వస్తోంది. ఇంత పెద్ద పట్టణంలో అసలు ప్రభుత్వాసుపత్రి ఎందుకు లేదో అర్థం కావటం లేదు. ప్రజల ఇబ్బందులు ప్రభుత్వాధికారులు గుర్తించాలి. ఇక్కడే ఆసుపత్రి నెలకొల్పితే దూర భారం తగ్గుతుంది.
– కంది రాజేశ్వరి

అన్నింటికీ మంచిర్యాలే దిక్కు..

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఏ రోగం వచ్చినా ప్రతీ దానికి మంచిర్యాలకే వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. అత్యవసర పరిస్థితుల్లో వ్యయప్రయాసాలకు ఓర్చి జిల్లా కేంద్రానికే వెళ్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాట్లు, కుక్క కాట్లకు సైతం ఇక్కడ అత్యవసర వైద్యం లేదంటే పరిస్థితి ఇట్టే అర్థమవుతోంది. సింగరేణి ఏరియా ఆసుపత్రి పట్టణంలో ఉన్నప్పటికీ అది కేవలం సింగరేణి కార్మికులు, వారి కుటుంబసభ్యులకే పరిమితం. మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో కొద్ది రోజుల క్రితం పాము కాటుకు గురైన ఓ యువకుడు సకాలంలో వైద్యం అందక మంచిర్యాలకు వెళుతున్న క్రమంలో మార్గమధ్యంలోనే మృతిచెందాడు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తెచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

క్రమపద్ధతిలో వివరాలు సేకరించండి



భీమారం: పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు



కొల్లూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు

భీమారం/కోటపల్లి: ప్రతి కుటుంబం సర్వే వివరాలు క్రమపద్ధతిలో సేకరించాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి, రాజకీయ కుల వివరాలను క్రమపద్ధతిలో సేకరించాలన్నారు. సర్వేలో ఎలాంటి అనుమానాలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. భీమారంలో నిర్వహిస్తున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని గుర్తించి స్టిక్కర్లు వేయాలని అధికారులకు సూచించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీవో సతీష్ రెడ్డిని ఆదేశించారు. కోటపల్లి మండలం కొల్లూర్, రాంపూర్ గ్రామాల్లోని కుటుంబ సర్వేను మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్ పరిశీలించారు. కార్యక్రమాల్లో కోటపల్లిలో సూపర్‌వైజర్ అజయ్, ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, భీమారంలో పంచాయతీ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి: సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇంటి నంబర్ ప్రక్రియ పూర్తి

దండేపల్లి: ఈ నెల 6 నుంచి చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా దండేపల్లి మండలంలో ఇళ్ల జాబితా ప్రక్రియ(ఇంటింటికీ నంబర్ వేయడం) కార్యక్రమం ఆదివారం పూర్తయినట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఇళ్ల జాబితా ప్రక్రియలో భాగంగా సర్వేకు సంబంధించి ప్రతి ఇంటికీ నంబర్ వేసినట్లు తెలిపారు. దండేపల్లిలో ఇంటింటికీ నంబర్ వేసే ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు. సర్వేకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు.

భూములు కాపాడాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ముందున్న సంజీవని ఆంజనేయస్వామి భూములను కాపాడాలని కోరుతూ ఆదివారం అభయాంజనేయస్వామి దేవాలయకమిటీ సభ్యులు, భజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి శ్రేణులు, బీజేపీ శ్రేణులు రాస్తారోకో చేశారు. రైల్వేస్టేషన్ ముందున్న రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. ఆంజనేయస్వామికి చెందిన భూములను జేసీబీలతో చదును చేయించి అక్రమంగా కబ్జా చేస్తున్నారనే సమాచారంతో దేవాలయ కమిటీ సభ్యులు, హిందూసంఘాల శ్రేణులు, బీజేపీ నాయకులు అక్కడికి చేరుకొని అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు, భూ ఆక్రమణ దారుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారం మాటున ఇష్టారాజ్యంగా దేవుని భూములను స్వాహా చేయడం సరికాదని, జాయింట్ సర్వే పూర్తి కాకముందే పనులు కొనసాగిస్తున్నారని నాయకులు విమర్శించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఆంజనేయస్వామి భూములు కాపాడటానికి చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ చొరవతో జేసీబీలను పోలీసుస్టేషన్‌కు తరలించడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, హిందూ సంఘాల శ్రేణులు, ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ రేవంత్ సారథ్యంలో అధికారం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పదవీ వియోగం ఉందని బీజేపీకి చెందిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చిలక జోస్యం చెప్పడం మానుకోవాలని, వచ్చే ఎన్నికల్లోనూ రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వర్ రెడ్డి బీజేపీలో చేరిన తరువాత జ్యోతిష్యం నేర్చుకున్నాడని ఎద్దేవ చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సారథ్యంలో 100సీట్లతో మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం అసంభవమని, బీఆర్ఎస్ దుకాణం మూతపడిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు కేవలం కుటుంబ సమస్యల్లాంటివని, అవి ఎప్పటికప్పుడు తొలగిపోయేవేనన్నారు. మంచిర్యాలలో రూ.300కోట్లతో 650పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను ఈ నెలాఖరులో ప్రారంభిస్తామని, రూ.255 కోట్లతో రాళ్లవాగు వరద రాకుండా ఉండేందుకు గాను కరకట్ట నిర్మాణ పనులను సైతం ప్రారంభిస్తామన్నారు. 650పడకల్లో 225మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి, 425పడకలను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని గడువులోపు పూర్తి చేసి చూపిస్తామని, అలా చేస్తే ప్రతిపక్ష నేతలు రాజకీయ సన్యాసం తీసుకుంటారాని ప్రశ్నించారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఏకమయ్యాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. భూమి కోసం భుక్తి కోసం అనేక మంది విప్లవకారులు పోరాటాలు చేసి ఈ నవంబర్ నెలలోనే ఎక్కువ మంది ప్రాణాలర్పించారని అందుకే వారిని స్మరిస్తూ నివాళులర్పించిన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, టి.శ్రీనివాస్, బ్రహ్మ నందం తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

దండేపల్లి: మండల ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీని ఆదివారం దండేపల్లిలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సాదం బాపు, అధ్యక్షుడిగా ఏదుల రమేశ్, ఉపాధ్యక్షులుగా మైనేని కిష్టయ్య, ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా అర్జున్, సాంస్కృతిక కార్యదర్శులుగా జాడి, నర్సయ్య, ప్రచార కార్యదర్శులుగా రమేశ్, బాపు, సహాయ కార్యదర్శిగా ఎల్లయ్య, సలహాదారుడిగా వెంకటి ఎన్నికయ్యారు.

పరిహారం ఇప్పించండి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గాలికుంటు వ్యాధి నివారణకు పశువైద్యులు చేసిన ఇంజెక్షన్ వికటించి ఆ ఆవు మృతి చెందిందని, అలాగే మరికొన్ని పశువులు అనారోగ్యం బారిన పడ్డాయని ఓ రైతు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గొల్లపల్లి గ్రామంలో ఇటీవల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అయితే అదే గ్రామానికి చెందిన కోట లచ్చయ్య తనకు ఉన్న రెండు ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించగా అందులోని ఓ ఆవు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై శనివారం రాత్రి మృతి చెందింది. టీకా వేయించిన నాటి నుంచి ఆవు మేత మేయడం లేదని, నీరు కూడా తాగ లేదని, పశు సంవర్ధక శాఖ నిర్లక్ష్యం వల్ల తన ఆవు చనిపోయిందని ఆరోపించాడు. చనిపోయిన ఆవు విలువ రూ.40వేలు ఉంటుందని పేర్కొంటూ నష్టపరిహారం ఇప్పించాలని, ఆవు మృతికి కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పశు యజమాని లచ్చయ్య డిమాండ్ చేశారు.

క్రికెట్ పోటీల్లో విజేత హిమాన్ష్ జట్టు



ప్రథమ స్థానం కైవసం చేసుకున్న హిమాన్ష్ జట్టు

చెన్నూర్: చెన్నూర్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన సునీల్, సతీశ్ స్మారక మున్సిపాలిటీ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. క్రికెట్ పోటీల్లో 12జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్ హిమాన్ష్ జట్టు, బ్లాక్ మంబా జట్లు తలపడ్డాయి. పది పరుగుల తేడాతో హిమాన్ష్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ బ్లాక్ మంబా జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. గెలుపొందిన విజేతలకు పోటీల నిర్వాహకులు నేవూరి శివ, శ్రీనివాస్‌లు మెమోంటోలను అందజేశారు. పోటీల్లో ఆల్ రౌండర్ ప్రతిభ కనబర్చి తరుణ్ అనే క్రీడాకారుడు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'లను కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి



పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. కాలనీల్లో తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ల వేణు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'గుడి పేరుతో చందా వసూలు సరికాదు'

శ్రీరాంపూర్: గుడి పేరుతో ఏఐటీయూసీ నాయకులు కార్మికుల నుంచి చందాలు వసూలు చేయడం సరికాదని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల ఒక నెల వేతనం నుంచి రూ.500 ఏఐటీయూసీ నాయకులు గుడికి చందాల పేరుతో కోత పెట్టి వారి ఖాతాలో జమ చేసుకోవడం చట్టవిరుద్ధమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే కార్మికుల ఖాతాలోకి తిరిగి డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

'చందా రికవరీ నిబంధనలకు విరుద్ధం'

శ్రీరాంపూర్: కార్మికుల అనుమతి లేకుండా ఏకపక్షంగా వారి వేతనాల నుంచి చందా రూ.500 వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని సీఐటీయూ కేంద్ర కార్యదర్శి మంద నర్సింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ఏఐటీయూసీ నాయకులు కార్మికులకు తెలుపకుండా చందా డబ్బులు రికవరీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే వారి డబ్బులను రిటర్న్ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మంచిర్యాలటౌన్: ఇటీవల కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో భోజనం వికటించి పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారిని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం పరామర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించి, ప్రస్తుత పరిస్థితిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యం అందించేలా చూస్తానని ఆయా కుటుంబాలకు భరోసా కల్పించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ సభ్యత్వ నమోదు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన నిర్మించుకున్న రైతులు



తాత్కాలిక వంతెన నిర్మించుకుంటున్న రైతులు

భీమిని: మండలంలోని తంగళ్లపల్లి, చిన్న తిమ్మాపూర్ గ్రామాల మధ్య ఎర్రవాగుపై స్థానిక రైతులు తాత్కాలికంగా రోడ్డు, వంతెన నిర్మించుకున్నారు. ఏటా వర్షాకాలంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులే డబ్బులు పోగుచేసుకొని సమస్య ను ఐకమత్యంగా ముందుకొచ్చి పరిష్కరించుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి పక్కా వంతెన ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

హౌస్ లిస్టింగ్ పనుల పరిశీలన



గోడకు స్టిక్కర్ అంటిస్తున్న చైర్‌పర్సన్, పక్కన ఆర్డీవో

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఇంటింటి సర్వే కోసం నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ పనులను ఆర్డీవో హరికృష్ణ ఆదివారం తనిఖీ చేశారు. మున్సిపాలిటీలోని 11, 23 వార్డులకు వెళ్లి హౌస్ లిస్టింగ్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కుల గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించడానికి ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు ఇతర సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ జె.శ్వేత మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అధ్వానంగా వాకింగ్ ట్రాక్



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ అధ్వానంగా తయారైంది. గుంతలు ఏర్పడి వర్షం పడినప్పుడల్లా నీళ్లు నిలుస్తున్నాయని, పిచ్చిమొక్కలు మొలిచి విష సర్పాలకు నిలయంగా తయారైంది. వాకింగ్ ట్రాక్‌పై పోసిన మట్టి కుప్పలు అలాగే వదిలేయడంతో వాకర్స్‌కు ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే వాకింగ్ ట్రాక్ మరమ్మతు చేసి, చెడిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, కార్మిక కుటుంబాలు, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు.